www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 29 నవంబర్ 2025
5
ఏలూరు

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు సాయి దీపక్

ప్రజాశక్తి - టి.నరసాపురం

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు సాయిదీపక్ ఎంపికైనట్లు టి.నరసాపురం హైస్కూల్ హెచ్‌ఎం బి.ఎల్.స్వామి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాయి దీపక్‌ను శుక్రవారం పాఠశాల సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు స్వామి మాట్లాడుతూ ఈ నెల 24న ఏలూరు సమీపంలోని వంగూరులో జరిగిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సాయి దీపక్ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 క్రికెట్ పోటీలకు ఎంపికై గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీ రామకృష్ణ, కెవి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'పోలవరం' లేని జిల్లా..!

జిల్లాల మార్పులు, చేర్పులపై జనాల్లో తీవ్ర చర్చ - పోలవరం జిల్లా ఏర్పాటుపై హర్షం

ఏలూరు జిల్లాలోని ఆదివాసీ మండలాలను విస్మరించడంపై విమర్శలు - కైకలూరు, నూజివీడు నియోజకవర్గాల్లో అసంతృప్తి జ్వాలలు

అభ్యంతరాలు సమర్పించేందుకు అంతా సన్నద్ధం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాల మార్పులు, చేర్పులపై జనాల్లో తీవ్ర చర్చ సాగుతోంది. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీకి.. ప్రస్తుతం ఇచ్చిన నోటిఫికేషన్‌కు ఏమాత్రం సంబంధం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాల మార్పులు, చేర్పులకు సంబంధించి ప్రభుత్వం గురువారం ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసింది. అభ్యంతరాలు, సూచనల స్వీకరణకు 30 రోజులు గడువిచ్చింది. ఏలూరు జిల్లాకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు గెజిట్‌లో లేకపోవడంతో నిరసన జ్వాలలు రేగుతున్నాయి. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతాలను కలిపి పోలవరం జిల్లాగా ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో సిఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో రంపచోడవరం జిల్లా కేంద్రంగా పోలవరం జిల్లాను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది. దీనిపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నా కొత్తగా ఏర్పాటు చేస్తున్న పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గ ప్రస్తావనగాని, ఆదివాసీ ప్రాంతాల చేర్పునకు సంబంధించిన ఊసుగాని ఏమీ లేకుండాపోయింది. దీంతో ఆదివాసీ ప్రాంతాలతో ఏర్పాటు చేస్తున్న పోలవరం జిల్లాలో పోలవరం లేకపోవడం ఏమిటనే ప్రశ్న అందరినీ తొలిచేస్తోంది. జిల్లాలోని పోలవరం నియోజకవర్గాన్ని పోలవరం జిల్లాలో కలపాలనే డిమాండ్ పెద్దఎత్తున విన్పిస్తోంది. ఆదివాసీ ప్రాంతాలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న జిల్లాలో ఆదివాసీలు ఉంటే కొంతమేర న్యాయం జరిగే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పోలవరం ప్రాజెక్టుతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు పూర్తిగా ముంపునకు గురవుతున్నాయి. అక్కడి ఆదివాసీ కుటుంబాలను జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, పోలవరం మండలాల్లో నిర్వాసిత కాలనీలు ఏర్పాటు చేసి తరలించారు. భూమికి భూమి కూడా ఆయా ప్రాంతాల్లోనే ఇచ్చారు. నిర్వాసితులు తమ సమస్యలు పరిష్కారం కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పోలవరం జిల్లాలో కలిపితే నిర్వాసితుల సమస్యలపై అధికారులు త్వరితగతిన స్పందించే అవకాశం ఉంటుంది. పోలవరం నియోజకవర్గాన్ని మొత్తం పోలవరం జిల్లాలో కలపాలనే డిమాండ్ ఒకవైపు, ఆదివాసీ ప్రాంతాలైనా నూతన పోలవరం జిల్లాలో కలపాలనే మరో చర్చ సాగుతోంది. దీనిపై కలెక్టర్లకు తమ అభ్యంతరాలను తెలిపేందుకు పలు ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు సైతం సిద్ధమవుతున్నాయి. అభ్యంతరాల స్వీకరణ తర్వాత ఫైనల్ గెజిట్‌లో మార్పులు, చేర్పులపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాలి.

నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల్లో అసంతృప్తి జ్వాలలు

2024 ఎన్నికల సందర్భంగా నూజివీడులో జరిగిన బహిరంగసభలో సిఎం చంద్రబాబు మాట్లాడుతూ ప్రజల కోరిక మేరకు నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారు. జిల్లాల విభజన సందర్భంగాను నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో కలపాలని అక్కడి ప్రజలు నిరసన దీక్షలు సాగించిన పరిస్థితి సాగింది. జిల్లాల మార్పులకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో నూజివీడు నియోజకవర్గంపై ఎటువంటి ప్రస్తావన లేదు. దీంతో ప్రజల్లో నిరసన జ్వాలలు మిన్నంటుతున్నాయి. జెఎసి ఆధ్వర్యంలో మరోసారి నిరసన దీక్షలు సాగుతున్నాయి. కైకలూరు నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో కలపాలని అక్కడి ప్రజలు బలంగా కోరుతున్నారు. స్థానిక ఎంఎల్‌ఎ కామినేని శ్రీనివాస్‌తోపాటు అనేక మంది కైకలూరు నియోజకవర్గాన్ని కృష్ణాలో కలపాలంటూ మంత్రుల కమిటీకి వినతులు సైతం ఇచ్చారు. ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్‌లో కైకలూరు నియోజకవర్గ ప్రస్తావన కూడా లేకుండాపోయింది. దీంతో అక్కడి ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం హామీ ఇచ్చి తమను మోసగించిందనే అభిప్రాయం అక్కడి ప్రజల్లో నెలకొంది. నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలను విడదీస్తే ఏలూరు జిల్లా అతి చిన్నదిగా మారుతుందనే అభిప్రాయంతో ప్రభుత్వం వెనక్కి తగ్గినట్లు రాజకీయ నేతల్లో చర్చ సాగుతోంది. నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల నుంచి పెద్దఎత్తున అభ్యంతరాలను జిల్లా కలెక్టర్‌కు అందించేందుకు అక్కడి ప్రజలు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం విడుదల చేసే ఫైనల్ గెజిట్‌లో ఎటువంటి మార్పులు, చేర్పులు ఉంటాయో వేచిచూడాలి.

సిఎం పర్యటనకు చురుగ్గా ఏర్పాట్లు

వర్షమొచ్చినా ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లకు కలెక్టర్ దిశానిర్దేశం

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ, కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి - ఉంగుటూరు

ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. డిసెంబరు ఒకటిన సిఎం చంద్రబాబు నల్లమాడు పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం వరస సమీక్షలు, క్షేత్రస్థాయి పరిశీలనల్లో తలమునకలైంది. ఉంగుటూరు మండలం నల్లమాడులో హెలికాప్టర్ దిగాక ఎల్-1, ఎల్-2 కంపార్టుమెంట్లో ఎంఎల్ఎలు, వివిఐపిలు, విఐపిలను సిఎం కలుస్తారు. అనంతరం గోపీనాథపట్నం(పట్టంపాడు)లో డయాలసిస్ బాధితురాలు ఇంటికెళ్లి ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ అందించి అక్కడ సుమారు 20 నిమిషాలపాటు గడుపుతారు. అక్కడ నుంచి గొల్లగూడెంలో ప్రజావేదికలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తారు. భోజన విరామం తర్వాత పార్టీ ముఖ్యనాయకులతో సమావేశం కానున్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్, జెసి అభిషేక్‌గౌడ ఉంగుటూరు ఎంపిడిఒ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ నెల 29న తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో యంత్రాంగం ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని, వర్షం కురిసినా ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలని దిశానిర్దేశం చేశారు. మరోవైపు సభా వేదిక, వాహనాల పార్కింగ్, బెంచ్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. గోపీనాథపట్నంలో ద్వారకాతిరుమల వెళ్లే భక్తులకు ఎంఎల్ఎ ధర్మరాజు నిర్వహిస్తున్న అన్నదాన సత్రం ఆవరణలో హెలిప్యాడ్ కోసం పరిశీలిస్తున్నారు. సిఎం పర్యటనా ఏర్పాట్లను ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పర్యవేక్షిస్తున్నారు.

లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ ఆందోళన

నినదిస్తున్న కార్మికులు, నేతలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కార్మికులకు, రైతులకు, వ్యవసాయ కూలీలకు, ప్రజలకు నష్టం చేకూర్చే నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అన్నపూర్ణ రైస్‌మిల్లు సెంటర్లో లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రాంబాబు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కూడా బిజెపితో చేతులు కలిపి ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో ఎస్.శివకుమార్, కె.సీతారాములు, సిహెచ్.సుబ్రమణ్యం, పి.రామారావు, టి.నాగు, ఎం.నాగేంద్రబాబు, గోపీ, త్రిమూర్తులు, సిహెచ్.సత్యనారాయణ, కె.దుర్గారావు, డి.వీర్రాజు, వి.దుర్గారావు, బి.సురేష్, ఆకుల నాగేశ్వరరావు, ఆకుల నాగరాజు, బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కైకలూరును కృష్ణాలోనే కలపాలి

అంబుల వైష్ణవి

ప్రజాశక్తి - ముదినేపల్లి

కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో కలిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకోవాలని అమరావతి బ్రాండ్ అంబాసిడర్, వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి కోరారు. శుక్రవారం ఆమె ముదినేపల్లిలో మాట్లాడుతూ తాజాగా జిల్లాల పునర్విభజనలో కూటమి ప్రభుత్వం కైకలూరు నియోజకవర్గాన్ని ఏలూరు జిల్లా నుంచి కృష్ణా జిల్లాలో కలుపుతారని అంతా ఎదురుచూశారన్నారు. ఆ ప్రతిపాదన పెండింగ్లో పెట్టడం వల్ల నియోజకవర్గంలోని ప్రజలంతా నిరాశకు గురవుతున్నారన్నారు. కైకలూరు నియోజకవర్గ ప్రజలకు మచిలీపట్నం కేంద్రంగా ఉన్న కృష్ణా జిల్లాతో అనుబంధం ఎక్కువన్నారు. ఏలూరు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే కనీసం ముదినేపల్లి నుంచి ఆర్‌టిసి బస్ సౌకర్యం గత నాలుగేళ్లుగా లేదని అంబుల వైష్ణవి తెలిపారు.

నూజివీడును ఎన్‌టిఆర్ జిల్లాలో కలపాలని రాస్తారోకో

రాస్తారోకోలో నినదిస్తున్న నేతలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో కలపాలని నూజివీడు జెఎసి, నూజివీడు బార్ అసోసియేషన్, అభ్యుదయవాదులు, ప్రజాసంఘాల, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక చిన్నగాంధీ బొమ్మ సెంటర్లో మానవహారం, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎసి గౌరవాధ్యక్షులు చలసాని రామారావు, అధ్యక్షులు మరీదు శివరామకృష్ణ, నూజివీడు బార్ అసోసియేషన్ నాయకులు ఇందుపల్లి సత్యప్రకాష్ మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల సందర్భంగా నూజివీడు వచ్చి ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెఎసి నేతలు చాట్ల పుల్లారావు, ఎం.సునీల్‌కుమార్, నూజివీడు బార్ అసోసియేషన్ నాయకులు వైఎస్.దొరయ్య, సిహెచ్.అర్జున్‌రావు, వై.హరిబాబు, జాన్‌బాబు, సిహెచ్.తేజచంద్, సుధాకర్, ఎకెడి.ప్రసాద్, వివిధ పార్టీల, ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టంలోని క్లాజులు మార్చాలి

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌కు యుటిఎఫ్ వినతి


మాట్లాడుతున్న ఎంపీ, యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎన్నో సంవత్సరాలుగా పని చేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులు కచ్చితంగా టెట్ క్వాలిఫై కావాలనే సుప్రీంకోర్టు తీర్పును సవరించాలని, విద్యాహక్కు చట్టంలోని క్లాజులు మార్పు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ ముస్తఫా ఆలీ, ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్షి మాట్లాడుతూ రెండు సంవత్సరాల్లోపు టెట్ క్వాలిఫై కాకపోతే ఆ ఉపాధ్యాయులను సర్వీస్ నుండి తొలగించాలని విద్యాహక్కు చట్టంలోని క్లాజ్ 23(2) ప్రకారం సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందన్నారు. మన రాష్ట్రంలో లక్ష మంది సీనియర్ టీచర్లు టెట్ క్వాలిఫై కావాల్సిన పరిస్థితి ఉందని, లేదంటే ఉద్యోగాలు కోల్పోవాల్సి ఉంటుందన్నారు. టెట్ అనేది 2011 నుండి విద్యాహక్కు చట్టం అమలుతో ప్రారంభమైందని, 2011కు ముందు 20, 30 సంవత్సరాల నుండి పని చేస్తున్న ఉపాధ్యాయులను ఇప్పుడు టెట్ రాయాలనడం సరికాదన్నారు. ఈ విషయాన్ని పార్లమెంట్ దృష్టికి, ప్రధానమంత్రి, విద్యాశాఖా మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని నేతలు కోరారు. దీనిపై ఎంపీ సానుకూలంగా స్పందిస్తూ పార్లమెంటులో మాట్లాడి సుప్రీంకోర్టు తీర్పు సవరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, జిల్లా కోశాధికారి జివి.రంగమోహన్, జిల్లా కార్యదర్శులు ఈడే శివశంకరరావు, జి.అంజన, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ బి.మోహన్‌రావు పాల్గొన్నారు.

'పది'లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలి

ఉపాధ్యాయులకు ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ఆర్.ఆషా విజ్ఞప్తి


మాట్లాడుతున్న ఆర్.ఆషా

ప్రజాశక్తి - భీమడోలు

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు అందరూ నూరు శాతం ఉత్తీర్ణులయ్యే విధంగా సిద్ధం చేయాలని ఉపాధ్యాయులను ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ఆర్.ఆషా కోరారు. తన పర్యటనలో భాగంగా పూళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు భువనేశ్వరరావు, ఎంఇఒ శ్రీనివాసరావు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. పూళ్లతోపాటు జిల్లాలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించకుండా కేవలం ఒక పూట మాత్రమే నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఇకపై 10వ తరగతి విద్యార్థులకు రెండు పూటలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. పూళ్ల హైస్కూల్లో గత విద్యా సంవత్సరం కేవలం 66 శాతం మాత్రమే ఉత్తీర్ణతా శాతం ఉన్నట్లు ఎంఇఒ తెలిపారు. అయినప్పటికీ ఆ పాఠశాలకు చెందిన విద్యార్థి 585 మార్కులు సాధించి మండలస్థాయిలో ప్రభుత్వ పాఠశాలలపరంగా ప్రథమ స్థానం సాధించారన్నారు. దీనిపై స్పందించిన ఎసి ప్రతి విద్యార్థీ 590 మార్కులకు తక్కువ కాకుండా సాధించేలా పర్యవేక్షించాలన్నారు. కొద్దిసేపు విద్యార్థులతో మమేకమయ్యారు. పరీక్షల్లో విజయం సాధించడానికి చేయాల్సిన పనులను వివరించారు. అనంతరం ఎంఇఒ మాట్లాడుతూ మండలంలోని ఆరు ప్రభుత్వ, సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన బాలికల గురుకులం, నాలుగు ప్రయివేట్ విద్యా సంస్థల నుంచి 912 మంది పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. గత విద్యా సంవత్సరం పరీక్షల నిర్వహణకు ఆరు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వీటిలో పొలసానిపల్లిలోని బాలికల గురుకులంలోని పరీక్షా కేంద్రం పరీక్షల నిర్వహణకు అనువుగా లేనట్టు గుర్తించామని, దీనిని భీమడోలు హైస్కూల్లో భీమడోలు హైస్కూల్-2 పరీక్షా కేంద్రంగా ఏర్పాటుకు ప్రతిపాదించామని తెలిపారు.

7న జాతీయ ఉపకార వేతన పరీక్ష

జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

2025-26 విద్యాసంవత్సరానికి జరగనున్న జాతీయ ఉపకార వేతన పరీక్ష డిసెంబర్ ఏడో తేదీ ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థుల హాల్ టికెట్లను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయపు వెబ్‌సైట్ www.bse.ap.gov.inలో పాఠశాల లాగిన్‌లోనూ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. వాట్సాప్ ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే విధానం కార్యాలయపు వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాఠశాల యు డైస్ కోడ్‌ను ఉపయోగించి లాగిన్ అయి తమ పాఠశాలకు సంబంధించిన విద్యార్థుల హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందించాలని, సంబంధిత విద్యార్థుల వివరాల్లో ఏమైనా సవరింపులు ఉంటే సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులచే ధ్రువీకరించే లేఖతో పరీక్ష కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్‌ను కలిసి సెంటర్ నామినల్ రోల్‌లో తప్పకుండా నమోదు చేయించుకోవాలని తెలిపారు. హాల్ టికెట్ లో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా విద్యార్థి పరీక్షా కేంద్రాన్ని తెలుసుకోవచ్చని తెలిపారు.

సిఐటియు జాతీయ మహాసభ జయప్రదానికి పిలుపు

నిడమర్రులో...

ప్రజాశక్తి - నిడమర్రు

విశాఖలో డిసెంబరు 31 నుంచి జనవరి నాలుగో తేదీ వరకు జరిగే సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని, జనవరి నాలుగో తేదీన లక్షలాది మందితో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని నిడమర్రు, భువనపల్లి గ్రామాల్లో సిఐటియు ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేస్తూ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. సిఐటియు ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు మాట్లాడుతూ కార్మిక, కర్షక, ఉద్యోగ, రైతుల హక్కులు, చట్టాల కోసం, రక్షణ కోసం నిరంతరం సిఐటియు పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంకు నాగశ్రీను, లింగబరి లక్ష్మణరావు, దివ్య నారాయణ, శంకుమనేశ్వరరావు, గుణ్ణం రాము, కె.భీమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వేలేరుపాడు : బడుగు బలహీన తరగతుల ప్రజా సమస్యలపై, కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రణాళిక పద్ధతితో వారి సమస్యలు పరిష్కారమయ్యే వరకు సిఐటియు నిరంతరం పోరాడుతూనే ఉంటుందని నాయకులు అన్నారు. డిసెంబర్ 31వ తేదీ నుంచి జనవరి నాలుగో తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించే 18వ సిఐటియు అఖిలభారత మహాసభ జయప్రదం చేయాలని జిల్లావ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో ఆటో జాతా నిర్వహిస్తున్నారు. ఈ ఆటో జాతా శుక్రవారం నాలుగో రోజు కుక్కునూరు మండలం నుంచి వేలేరుపాడు మండలం చేరుకుంది. ఈ నేపథ్యంలో ఆశా వర్కర్ల రాష్ట్ర అధ్యక్షులు పోశమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ స్కీమ్స్ పనిచేస్తున్న ఆశా, అంగన్వాడీ, మున్సిపల్ వర్కర్లు, మిడ్ డే మీల్స్ వర్కర్లు, విద్యుత్ కాంట్రాక్ట్ వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు వివిధ శాఖల్లో పనిచేసే కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ తదితర కార్మికుల సమస్యలపై సిఐటియు నిరంతరం పోరాటం చేస్తుందని, వారి ఉద్యోగ భద్రత, కనీస వేతనాలపై నిరంతరం కృషి చేస్తూ అండదండలుగా ఉంటుందని చెప్పారు. అన్ని తరగతుల ప్రజల సమస్యలకు సిఐటియు చేదోడువాదోడుగా ఉంటుందన్నారు. డిసెంబర్ 31 నుంచి జనవరి నాలుగో తేదీ వరకు జరిగే మహాసభకు 70 లక్షల మంది కార్మికులు హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు. ఈ మహాసభలో ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేస్తారన్నారు. మహాసభ జయప్రదానికి కార్మిక కర్షక వర్గాలు ముందుకొచ్చి జయప్రదం చేయాలని, అవసరమైన సహాయ సహకారాలు అందించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కరుణేశ్వరి, మండల కన్వీనర్ ఎస్.లత, సిఐటియు నాయకులు మడివి దుర్గారావు, సిపిఎం మండల కార్యదర్శి ధర్ముల రమేష్, సిఐటియు సభ్యులు డి.శైలజ, కృష్ణవేణి, రిబ్కా జ్యోతి, సుమలత, పాల్గొన్నారు.


కుక్కునూరులో...

కుక్కునూరు రూరల్ : విశాఖపట్నంలో జరిగే సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి కె.పోశమ్మ కోరారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో కారం రాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన ఆశావర్కర్ల సమావేశంలో పోశమ్మ పాల్గొని మాట్లాడుతూ కార్మికుల హక్కులు కోశం నిరంతరం పోరాటాలు చేస్తున్న సిఐటియు అఖిల భారత మహాసభ సిఐటియు ఏర్పడిన తర్వాత మొట్ట మొదటిసారిగా రాష్ట్రంలో విశాఖపట్నంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జనవరి నాలుగో తేదీన లక్ష మంది కార్మికులతో భారీ ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని, ఈ మహాసభను కార్మికులు, ప్రజలు, మేధావులు అందరూ సహకరించి జయప్రదం చేయాలని కోరారు.

75 టవర్ల ఏర్పాటుకు అనుమతులు : ఎంపీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

2027 చివరి నాటికి ఏలూరు పార్లమెంట్ పరిధిలో సిగ్నల్ నెట్‌వర్క్ సమస్యలను పూర్తిగా పరిష్కరించాలని లక్ష్యంగా నిర్ణయించామని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పష్టం చేశారు. 4జి నెట్‌వర్క్, టవర్ల సమస్యలపై శుక్రవారం ఏలూరు బిఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో ఎంపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 75 కొత్త టవర్ల ఏర్పాటుకు అనుమతులు వచ్చాయని, ఏడాదిలోగా సిగ్నల్ సమస్యలు అధికంగా ఉన్న ప్రాంతాలకు ప్రాధాన్యమిస్తూ త్వరగా టవర్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో బిఎస్‌ఎన్‌ఎల్ జిఎం ఎల్.శ్రీనివాస్, సిబ్బంది, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేదల సమస్యలు పరిష్కరించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో వన సంరక్షణ సమితుల్లో పని చేస్తున్న పేదల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొత్త ప్లాంటేషన్లకు అనుమతులు ఇవ్వాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, అటవీ ప్రాంత పేదలు, వన సంరక్షణ సమితుల సమైక్య సమావేశం జి.వెంకట్రావు అధ్యక్షతన ఏలూరులో అన్నే భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ ఈ జిల్లాలో అటవీ ప్రాంతాల్లో ఉన్న పేదలు, దళితులు అటవీ భూముల్లో గత 25 ఏళ్ల నుంచి భూములను సాగు చేస్తూ జామాయిల్, వెదురు, చింత, గుమ్మడి టేకు వివిధ రకాల పంటలు వేసి సాగు చేస్తున్నారని తెలిపారు. ప్రధానంగా ఏలూరు జిల్లాలో జామాయిల్ పంట విస్తారంగా వేస్తున్నారన్నారు. ఈ పంటలో విఎస్ఎస్ రూల్స్ ప్రకారం ఐదు నుంచి ఏడేళ్ల మధ్య వచ్చిన పంటను కటింగ్ ఆర్డర్ ఇవ్వాలని ఉండగా కటింగ్ ఆర్డర్లు ఇవ్వడం లేదన్నారు. పైగా ఉన్న విఎస్ఎస్‌లను ఎత్తివేసే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారని దుయ్యపట్టారు. అటవీ ప్రాంతంలో పేదలకు వ్యవసాయం పనులు లేని నేపథ్యంలో అటవీ భూముల్లో పోడు కొట్టి వన సంరక్షణ సమితులు పేరుతో వ్యవసాయం చేస్తున్నారని, వాటిల్లో వివిధ రకాల పంటలు వేసుకునేం దుకు అవసరమైన అనుమతులు అటవీ శాఖ ఇస్తుందన్నారు. జిల్లాలో తోచిలక రాయుడుపాలెం గ్రామం విఎస్ఎస్‌ను ఆన్‌లైన్‌లోనే లేకుండా చేయడం దుర్మార్గమన్నారు. బుట్టాయగూడెం మండలం పైదవారిగూడెంలో 20 ఏళ్ల అయినా నేటికి కటింగ్ ఆర్డర్ ఇవ్వలేదన్నారు. కొత్తపల్లి విఎస్ఎస్ ఆరేళ్ల పైగా అవుతున్నా నేటికీ కటింగ్ చేయలేదని మండిపడ్డారు. ఎర్రమళ్ల, చిన్న ఎల్లమల్లి, పెద్ద ఎల్లమెల్లి గ్రామాల్లో పనిచేసిన కూలీలకు వేతనాలు నేటికీ ఇవ్వలేదని, వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉంగుటూరులో కటింగ్ చేసి సంవత్సరం గడుస్తున్నా నేటికీ షేర్ అమౌంట్ పేదలకు, వ్యవసాయ కూలీలకు, విఎస్ఎస్ సభ్యులకు ఇవ్వాల్సిన డబ్బులు రిలీజ్ చేయలేదని, వాటిని వెంటనే రిలీజ్ చేయాలని కోరారు. లేకపోతే రానున్న కాలంలో జిల్లాలో ఉన్న అన్ని విఎస్ఎస్ సభ్యులను కదిలించి ఆందోళన పోరాటాలకు సన్నద్ధమవుతావని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా విఎస్ఎస్ సభ్యులు, జయరాజు, ఆంజయ్య, ప్రసాద్, కనకరాజు, కృపా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాబూరావు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

మాట్లాడుతున్న సిఐ బాలసురేష్

ప్రజాశక్తి - పోలవరం

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పోలవరం సిఐ బాలసురేష్ బాబు అన్నారు. పోలవరంలో శ్రీ సాయి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో సైబర్ నేరాలను నివారించే విధానాలు, కొత్త భారతీయ క్రిమినల్ చట్టాల్లోని మార్పులు, పోక్సో చట్టం ప్రాముఖ్యత, గుడ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థులతో అవగాహనా సదస్సును ఎస్ఐ పవన్ కుమార్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ పి.బాలసురేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులకు సైబర్ మోసాల ప్రమాదాలు, సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం పోలవరం ఎస్ఐ పవన్‌కుమార్ మాట్లాడుతూ చిన్నారుల రక్షణకు పోక్సో చట్టం అందించే భద్రత, పిల్లలు తప్పనిసరిగా తెలుసుకోవాల్సిన హక్కులపై స్పష్టతనిచ్చారు. శక్తి టీమ్ సిబ్బంది విద్యార్థులకు గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం నాగేశ్వరరావు, స్కూలు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'పది' ఫలితాల్లో మంచి మార్కులు సాధించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మంచి మార్కులు సాధించాలని చింతలపూడి ఎంపిపి రాంబాబు అన్నారు. చింతలపూడి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు విజయకేతనం బుక్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు అధిక మార్కులతో ఉత్తీర్ణత శాతం సాధించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బాగా చదువుకొని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ కిరణ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ఎఫ్‌ఎల్‌ఎన్ సర్వే

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని బాదంపూడి మోడల్ ప్రైమరీ స్కూల్‌లో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఎఫ్‌ఎల్‌ఎన్ సర్వేను పరిశీలనకు సందర్శించిన డైట్ కాలేజ్ అధ్యాపకులు లక్ష్మీ నారాయణ సర్వేచేస్తున్న డైట్ కాలేజ్ స్టూడెంట్ భాగ్య సత్య వాణి కి పలు సూచనలు చేశారు. లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ ఈ సర్వే ప్రకారం చదువులో వెనకబడిన విద్యార్థులకు వంద రోజుల రెడినెస్ ప్రోగ్రాం అమలు చేస్తారన్నారు. ఉపాధ్యాయులందరూ విద్యాప్రమాణాలు అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రేగాని రామకృష్ణ పాల్గొన్నారు.

సిఆర్ఆర్ కళాశాలలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రక్తదానం చేస్తున్న దాతలు

స్థానిక సర్ సిఆర్.రెడ్డి కళాశాలలో హెల్త్ సెంటర్, ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2, ఎన్‌సిసి విభాగాలు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్ ఆఫ్ హేలాపురి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సర్ సిఆర్.రెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ ఎంబిఎస్‌వి.ప్రసాద్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కెఎస్.విష్ణుమోహన్ రక్తదాన ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామారావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని 45 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. 50 మంది విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్ చేశారు.

సామాన్యుల ఆయుధం సమాచార హక్కు చట్టం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమాచార హక్కు చట్టం సామాన్యులకు ఒక ఆయుధం వంటిదని ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ బిలకపాటి దేవప్రకాష్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజినీర్ పుట్ట ధనుంజయులు అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఇరిగేషన్, పే అండ్ అకౌంట్స్ అధికారులు సిబ్బంది సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తూ ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ మీదుగా ఇండోర్ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు. తెలుసుకోవడం మీ హక్కు, చెప్పడం ప్రభుత్వ బాధ్యత అంటూ నినాదాలు చేశారు.

వృద్ధునికి నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి -ముదినేపల్లి

నిత్యావసరాలు అందిస్తున్న కృష్ణ

బిజెపి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కొట్టిపోలు కృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని నిరుపేద వృద్ధుని కుటుంబానికి నిత్యావసర సరుకులు అందించారు. ముదినేపల్లి శివారు అన్నవరం కాలువ గట్టులో నివసించే సిహెచ్.కనకరావుకు ఆధార్, రేషన్ కార్డు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి వచ్చే పింఛన్ కూడా రావడం లేదు. ఈ విషయం తెలుసుకున్న మేము సైతం మీకోసం మేమున్నాం టీం మొవ్వ ఫణీంద్ర ఆధ్వర్యంలో ఆ పేద కుటుంబానికి కొట్టిపోలు కృష్ణ ద్వారా నెల రోజులకు సరిపడ నిత్యావసర సరుకులు, దుప్పట్లు వృద్ధుని ఇంటి వద్ద అందించారు. ఈ కార్యక్రమంలో బందెల విజయసాగర్, అల్లాడి సాయి, కొనింకొటి దుర్గారావు, షేక్ గఫూర్, పోతన ప్రసాదు, మద్ది అనిల్, విజయ్ పాల్గొన్నారు.

ఏలూరు జిల్లా పేరు మార్చాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురి విజ్ఞప్తి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఏలూరు జిల్లాను పేరు మార్పు చేసి గోదావరి జిల్లా లేదా ఉత్తర గోదావరి జిల్లాగా పెట్టాలని పలువురు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో మెట్ట ప్రాంతంలోని ఉన్న ఏలూరు జిల్లా వాసులు, పూర్వ పశ్చిమ గోదావరి జిల్లా వాసులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు టిడిపి, జనసేన, బిజెపి, వైసిపి, కాంగ్రెస్, ప్రజా సంఘాలు, కమ్యూనిస్టు పార్టీలు, సామాజిక వేత్తలు, కళాకారులు, బిసి సంఘ నాయకులు, దళిత సంఘ నాయకులు, ముస్లిం మైనార్టీ నాయకులు, ప్రజాస్వామ్యవాదులు శుక్రవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏలూరు జిల్లాను పేరు మార్పు చేసి గోదావరి జిల్లా లేదా ఉత్తర గోదావరి జిల్లాగా పెట్టాలని కోరారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు.

మహిళల భద్రతకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మహిళల భద్రతకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ ఎం.జయబాబు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా భద్రతపై ఎస్ఐ ఎం.జయబాబు విద్యార్థులకు శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న నేరాలను అదుపు చేసేందుకు శక్తి మహిళా టీం సభ్యులతో, పాఠశాలలు, కాలేజీల వద్ద గస్తీని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. బాలికలపై లైంగిక నేరాలు జరిగినప్పుడు పోక్సో చట్టం ద్వారా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఎవరైనా బాల్య వివాహాలకు పూనుకుంటే డయల్ 1098కి సమాచారం అందించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బివిఎల్.స్వామి, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యర్థ జలాల శాంపిళ్ల సేకరణ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అశ్వారావుపేటలోని శ్రీలక్ష్మీతులసి పేపర్ బోర్డుకు సంబంధించిన వ్యర్థ జలాల శాంపిళ్లను శుక్రవారం తెలంగాణకు చెందిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సేకరించినట్లు గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తెల్లం దుర్గారావు తెలిపారు. పేపర్ బోర్డు నుంచి విడుదల చేసే వ్యర్థ జలాలు జీలుగుమిల్లి శివారులో ఉన్న తూములు చెరువులో కలిసి నీరు కలుషితమై పంటలకు, పశువులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వంకావారిగూడెం గ్రామానికి పలువురు గ్రామస్తులతో కలిసి జీవీఎల్ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు శుక్రవారం పొల్యూషన్ బృందం వారు ప్రాంతాన్ని పరిశీలించి శాంపిళ్లను సేకరించినట్లు తెలిపారు. శాంపిళ్లను పరిశీలించి అనంతరం నివేదిక ఉన్నతాధికారులకు ఇవ్వనున్నట్లు తెలిపారు.

మాలలంతా సంఘటిత శక్తిగా ఎదగాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

సంఘీభావం తెలుపుతున్న మాలలు

మాలలంతా సంఘటిత శక్తిగా ఎదిగి హక్కులను సాధించుకోవాలని అంబేద్కర్ ఇండియా మిషన్ జోనల్ ఇన్‌ఛార్జి మధిర శేషయ్య అన్నారు. మాల మహానాడు అనుబంధ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సేవా నాగ జగన్ బాబూరావు ఆధ్వర్యంలో మాల వనసమారాధన ఆత్మీయ కార్యక్రమం ముదినేపల్లిలోని రాష్ట్ర మాల మహానాడు కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువతరం బిఆర్ అంబేద్కర్ ఆదర్శాలను ఆచరణలోకి తీసుకోవాలన్నారు. అంబేద్కరిస్ట్ లంకపల్లి మాలతి, మేడపాటి శిరీష జ్యోతి ప్రజ్వలన చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు సత్తెనపల్లి కిషోర్, దాసరి చెన్నకేశవులు, లేళ్ల కృపారావు, గుడిపాటి వరప్రసాద్, సీనియర్ జర్నలిస్ట్ వి.విజయకుమార్, కలకొండ కమలకుమారి, భూపతి సునీత పాల్గొన్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఆదర్శప్రాయులు జ్యోతిరావు పూలే

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐద్వా ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించినట్లు ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలరాణి తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలకు విద్యా హక్కు, సాధనకు బాల్య వివాహాల నిర్మూలనకు జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విశేషమైన కృషి చేశారని, వారి స్ఫూర్తితో మహిళలు అణగారిన తరగతుల సమస్యలపై పోరాటాలకు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.నిర్మల, శాంతి, భవాని పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ :రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి క్యాంపు కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలేకు కూటమి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ సమాజంలో సమానత్వం, న్యాయం, విద్య, మానవ హక్కుల పరిరక్షణ కోసం నిరంతరంగా పోరాడిన మహానుభావుల్లో మహాత్మా జోతిరావు పూలే ఒకరన్నారు.

చింతలపూడి : జ్యోతిరావు పూలే ఆదర్శప్రాయులని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ కొనియాడారు. మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతిరావు పూలే అడుగు జాడల్లో నడవాలన్నారు.

ఏలూరు సిటీ :ఏలూరు ఎస్‌సి, ఎస్‌టి బహుజన రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ కార్యాలయంలో బలహీన తరగతుల ఆశాజ్యోతి బహుజన నాయకులు మహాత్మ జ్యోతిరావుపూలే 136వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. మానవతా స్వచ్ఛంద సేవసంస్థ డెవలప్‌మెంట్ కమిటీ ఛైర్మన్ మేతర అజయ్‌బాబు పాల్గొని జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

జిల్లా పరిషత్ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ మహాత్మా జ్యోతిరావు పూలే వారి ప్రతిమకు పూలమాల అర్పించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఇఒ, ఎఒలు, ఇతర అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముసునూరు : అణగారిన తరగతుల అభ్యున్నతి కోసం నిరంతరం పరితపించిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని వైసిపి ఏలూరు పార్లమెంట్ యువజన నాయకులు మానికల గంగాధర్ అన్నారు. ముసునూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భారతదేశంలో కుల నిర్మూలన, కుల వివక్షతపై రాజీలేని పోరాటం చేసిన సామాజిక విప్లవ పోరాట యోధుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని కొనియాడారు. ఈ

చింతలపూడిలో...

కార్యక్రమంలో రెడ్డి తిరుపతిరావు, జి.రంగారావు, సురేష్, శ్రీను, కాసులు, తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి :ముదినేపల్లిలో పూలే విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పూలే విగ్రహానికి కమిటీ కార్యవర్గ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విగ్రహ కమిటీ అధ్యక్షులు పి.పుణేశ్వరరావు, ఉపాధ్యక్షులు నిమ్మగడ్డ బిక్షాలు, గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ, డాక్టర్ వెంకట్రావు, కార్యవర్గ సభ్యులు జెవిఆర్, ఈడే వాసు, సోమల వరప్రసాద్, ఈడే శ్రీనివాసరావు, ఎండి రిజ్వాన్, ఈడే సీతారామ ప్రసాద్, కారె కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం :టిడిపి పట్టణ కార్యాలయంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్, మండలాధ్యక్షులు కుక్కల మాధవరావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి రామచంద్రరాజు, పరిమి సత్యనారాయణ, పాతూరి అంబేద్కర్, గుమ్మడి ప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. స్థానిక బర్రింకలపాడులోని గిరిజన గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు విజయ కేతనం పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి, ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు కె.శ్రీనివాస్, బుచ్చయ్య, ప్రిన్సిపల్ శ్రీపాద రామకృష్ణ, కూటమి నాయకులు లక్ష్మణ్, మధు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

డిజిలాక్‌పై అవగాహన

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక శ్రీ సుగుణ జూనియర్, డిగ్రీ కళాశాలలో బైర్రాజు ఫౌండేషన్ నిర్వహించే డిజిలాకర్‌పై విద్యార్థులకు ఎంపవర్‌మెంట్ సొల్యూషన్స్ కో-ఆర్డినేటర్ పి.భానుమూర్తి అవగాహన కల్పించారు. డిజిలాకర్‌లో రిజిస్టర్ అయ్యి మన సర్టిఫికెట్స్ పొందుపరచుకోవడం సురక్షితమన్నారు. ప్రిన్సిపల్ టివి.వెంకటేశ్వరరావు, కళాశాల ఛైర్మన్ కె.రాజమణి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆక్వా రంగం అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - మండవల్లి

ఆక్వారంగాన్ని అభివృద్ధి చేసే విధంగా రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని బిఎంఆర్ ఫీడ్ అధినేత ఎంపీ బీద మస్తాన్‌రావు అన్నారు. మండలంలోని లోకముడిలో నిర్వహించిన ఓ ప్రయివేట్ కార్యక్రమంలో ఆయన శుక్రవారం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వ్యవసాయ రంగంతోపాటు ఆక్వా రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. ఈ నెల 29, 30 తేదీల్లో లోకమూడిలోని సిఎన్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించే ఆక్వా ఎక్స్ పోను ఆక్వా రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, బోరుబోయిన శ్రీనివాసరావు, ఆక్వా రైతులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి - భీమడోలు

మనిషి జీవిత గమనాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దడంలో విద్య కీలకపాత్ర పోషిస్తుందని ఎంఇఒలు శ్రీనివాసరావు, భాస్కర్‌కుమార్ తెలిపారు. గత విద్యా సంవత్సరం భీమడోలు హై స్కూల్‌లో పదో తరగతి చదివి అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు 'కోరు మాస్టారు స్మారక ప్రతిభ పురస్కార్ అవార్డుల పేర ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల వారీగా నగదు పురస్కారం, మెమెంటో, ఇతర సత్కారాలను కొన్నేళ్ల కాలంగా కోరు మాస్టారుగా గుర్తింపు పొందిన కటారి కోరుకొండ నాగేశ్వర నరసింహమూర్తి సంస్మరణార్థం వారి కుమారులు ఎన్ఆర్ఐ కటారి పుణ్యమూర్తి అందిస్తున్నారు. వారి కుమారులు పుణ్యమూర్తి ప్రతి ఏడాది ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కోరు మాస్టారు స్మారక ప్రతిభ పురస్కారాలను అందిస్తున్నారు. దీనిలో భాగంగా భీమడోలు హైస్కూల్ కేంద్రంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మండల విద్యాధికారులు చేతుల మీదుగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఎస్.స్నేహగీతిక, సుధాభార్గవి, ఎల్.యశస్వీలకు ప్రతిభా పురస్కారాలను అందించారు. దీనిలో కోరు మాస్టారు రెండో కుమారులు, విశ్రాంత ఉపాధ్యాయులు రామమూర్తి, ఫణి రాజకుమారి భాగస్వాములయ్యారు. హై స్కూల్ ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు అహమద్ పాల్గొన్నారు.

పాఠశాల ప్రగతి బాగుంది : ఎంపిడిఒ

ప్రజాశక్తి - ముదినేపల్లి

పాఠశాల ప్రగతి బాగుందని ఎంపిడిఒ వై.రామకృష్ణ అన్నారు. మండలంలోని చినపాలపర్రు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం రామకృష్ణ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. పాఠశాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి ఉపాధ్యాయుని ప్రసన్నకుమారి పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం పథకం పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు వడ్డించాలన్నారు.

మురుగు కాలువలకు మరమ్మతులు

కలిదిండి :కిక్కిసతో మేట వేసుకుపోయిన మురుగు కాలువల మరమ్మతు పనులను టిడిపి మండలాధ్యక్షులు పోకల జోగిరాజు, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అండ్రాజు శ్రీనివాసరావు ప్రారంభించారు. మట్టగుంటలో సుమారు ఐదు కిలోమీ టర్ల యడవల్లి డ్రెయిన్ పనులు పూర్తయితే 500 మంది ఆక్వా రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. నాయకులు మంతెన సుబ్బరాజు, నాగిడి వీరబ్రహ్మం, ఇమ్మనేని చంద్రశేఖర్, అల్లూరి సతీష్ రాజు, తిరుమని పాండురంగరావు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల హక్కులు పొందాలి

రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అండ్రాజు శ్రీనివాసరావు

ప్రజాశక్తి - కలిదిండి

గ్రామీణ ప్రాంతాల్లోని నివాస గృహాల హక్కుల కల్పనకు స్వామిత్వ పథకం ద్వారా ప్రతిఒక్కరూ ఇళ్ల స్థలాల హక్కులు పొందాలని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అండ్రాజు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మట్టగుంటలో సర్పంచి అండ్రాజు రత్నమణి అధ్యక్షతన స్వామిత్వ పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. నాలుగు నెలలుగా ఇంటింటికీ తిరిగి జరిపిన సర్వేలో సమస్యలుంటే, వాటి పరిష్కారానికి గ్రామసభలు దోహదపడతాయని అండ్రాజు శ్రీనివాసరావు అన్నారు. డిప్యూటీ ఎంపిడిఒ కామినేని మారుతిప్రసాద్, డిసి ఛైర్మన్ నాగిడి వీర బ్రహ్మం, తిరుమలశెట్టి ఈశ్వర పరశురాముడు, దున్న సత్యనారాయణ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పలుచోట్ల 'రైతన్న మీకోసం'


పెదపాడులో...

ప్రజాశక్తి - పెదపాడు

రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా పెదపాడు మండలం పెదపాడు, కొత్తూరు గ్రామాల్లో దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ శుక్రవారం పర్యటించారు. అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధి పొందిన రైతులకు కూటమి ప్రభుత్వం తరపున సిఎం చంద్రబాబు నుంచి వచ్చిన అభినందన లేఖలను రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు సిటీ :రైతుల ముఖాల్లో అసలైన చిరునవ్వులు చూడడమే కూటమి ప్రభుత్వ అభిమతమని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. ఆ దిశగా వారిలో నూతనోత్తేజం నింపేందుకు కృషి చేస్తున్నామన్నారు. స్థానిక చొదిమెళ్లలో నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రైతు సేవా కేంద్రానికి వెళ్లి ధాన్యం సేకరణా ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, టిడిపి నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, కార్యదర్శి రెడ్డి నాగరాజు, ఏలూరు అర్బన్ తహశీల్దార్ గాయత్రి దేవి, తదితరులు పాల్గొన్నారు.

లింగపాలెం : సాగు భూమి కలిగి ఉన్న భూయజమాని రైతు కుటుంబాలకు అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు, పిఎం కిసాన్ పథకం కింద ప్రభుత్వం రూ.ఆరువేలు మొత్తం సంవత్సరానికి రూ.20వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నట్లు చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెం గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యటించారు.

ముసునూరు : రైతు సేవా కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలంటూ టిడిపి మండల మాజీ అధ్యక్షులు దేవినేని ధలరామ్ అన్నారు. మండల కేంద్రమైన ముసునూరులో రైతన్న మీకోసం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ పార్టీ అధ్యక్షులు గార్లపాటి నరసింహారావు, దేవినేని సాంబయ్య, దేవినేని రాజా, కోనేరు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదవాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

విద్యార్థి దశలో పదో తరగతి చాలా కీలకమని, అందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాశ నిపుణులు తాడేపల్లి మోహన్‌రావు నారాయణపురం హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఉంగుటూరు మానవత ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతిలో ఉత్తీర్ణులవ్వడానికి విద్యార్థులు పాటించాల్సిన చిట్కాలను ఆయన వివరించారు. ముఖ్యంగా సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పదో తరగతిలో ప్రతిభ చూపుతున్న ముగ్గురు విద్యార్థులను సత్కరించారు. కేతా నాగ పావని, గొంతిన కావ్య, నెక్కల పూర్ణసాహితిలకు ప్రశంసా పత్రం, జ్ఞాపిక, నిఘంటువు, ఫైల్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో మానవత ప్రాంతీయ ఛైర్మన్ పుప్పాల గోపీ, అధ్యక్షులు కోనే సత్యనారాయణ, ఛైర్మన్ గుణ్ణం బులెబ్బాయ్, ప్రధానోపాధ్యాయులు తోట పోతురాజు, శీతాల సత్యనారా యణ, బొమ్మిడి అప్పారావు, అడపా శ్రీనివాస్, గురివెల్లి రాజారావు, గంజి రవి, రాంబాబు పాల్గొన్నారు.

శీతాకాలంలో జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

శీతాకాలంలో జాగ్రత్తగా ఉండాలని, చలి వాతావరణం వల్ల అనారోగ్య సమస్యలకు గురయ్యే అవకాశం ఉందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. స్థానిక ఏలూరు కొత్తపేట పట్టణ ఆరోగ్య కేంద్రం పాముల దిబ్బ సెంటర్‌లో ప్రజలకు డ్రైడే కార్యక్రమంలో భాగంగా శీతాకాలంలో సంభవించే అనారోగ్య సమస్యల గురించి వివరించారు. చలి వాతావరణం వల్ల శరీరంలో మార్పులు జరిగి ఎలర్జీ కండిషన్స్ ముఖ్యంగా దగ్గు, జలుబు తుమ్ములు, ఆయాసం, ఉబ్బసం శరీరం మీద దద్దుర్లు అలాగే జ్వరాలు తదితర అంటువ్యాధులతో బాధపడే అవకాశం ఉందన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలు, వృద్ధులు, బాలింతలు, గర్భిణులు ఉదయం సమయంలో చలిలో తిరగరాదని సూచించారు. వేడివేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని, గోరువెచ్చని నీరు తాగాలని సూచించారు.

పేదల ఆరోగ్య సంరక్షణకు కూటమి కృషి : బడేటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పేదల ఆరోగ్య సంరక్షణకు కూటమి ప్రభుత్వం అనేక పథకాలను, వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి స్పష్టం చేశారు. ఏలూరులోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలో అనారోగ్యంతో బాధపడుతున్న 43 మందికి సిఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.22,30,480 విలువైన చెక్కులను ఎంఎల్ఎ బడేటి చంటి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు నియోజకవర్గ పరిధిలో మొత్తం 360 మంది బాధితులకు రూ.3,77,93,178 విలువైన సిఎం ఆర్ఎఫ్ చెక్కులను, ఎల్ఒసిలను అందించి ఆదుకున్నామన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు సిఎంఆర్ఎఫ్ ద్వారా మరింత భరోసా కల్పిస్తున్నామన్నారు.

'బిసి రిజర్వేషన్లపై స్పష్టమైన ప్రకటన చేయాలి'

కొయ్యలగూడెం :డిసెంబర్ ఒకటో తేదీ నుంచి జరగనున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో బిసి రిజర్వేషన్ల పట్ల కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని బిసి చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెలగల దుర్గారావు డిమాండ్ చేశారు. మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆయన మాట్లాడుతూ పూలే దంపతుల పోరాటాల ఫలితంగా లభించిన సామాజిక న్యాయం, అందరికీ విద్య, ఉపాధి ఇప్పటికీ బలహీన తరగతులకు అందని ద్రాక్షగానే మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న ఒబిసిలకు కేంద్ర ప్రభుత్వంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ లేకపోవడం రాజకీయ పార్టీలు బిసిల పట్ల చూపిస్తున్న వివక్షకు నిదర్శనమన్నారు. శీతాకాల సమావేశాల్లోనే జనగణనతో పాటు కులగణన చేసి, బిసి జనాభా లెక్కలను ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కేంద్రాన్ని కోరారు. సిపిఐ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు మాట్లాడారు. చిటికెన బాలగంగాధర్ తిలక్, అంగడాల గంగాధర్, పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు శుక్రవారం రగ్గులు, దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, మున్సిపల్ కమిషనర్ పీరయ్య మాట్లాడుతూ గడచిన నెల రోజులుగా నూజివీడు పట్టణంలో పారిశుధ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. పట్టణంలో పరిశుభ్రత విషయంలో కొత్త వరవడి ప్రారంభమైందన్నారు. సమస్యను పౌరుల నుంచి తెలుసుకొని చెప్పిన వెంటనే నిమిషాల ప్రకారం పారిశుధ్య కార్మికులు పరిశుభ్రం చేయడం అభినందనీయమన్నారు. క్లీన్ నూజివీడు లక్ష్యంగా ప్రణాళిక బద్ధంగా ముందడుగులు వేస్తున్నట్లు వివరించారు. పరిశుభ్రమైన పట్టణంగా నూజివీడును తీర్చిదిద్దడమే ఆశయంగా తెలిపారు. అందుకోసం పారిశుధ్య కార్మికులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, అన్ని తరగతుల ప్రజలు ఇందులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత పరిశుభ్రత, తరాల పరిశుభ్రతలను ప్రతిఒక్కరూ తప్పనిసరిగా పాటించాలన్నారు. పారిశుధ్య కార్మికులను సన్మానించుకోవడం మంచి సాంప్రదాయమన్నారు.

AKIVEEDU NAGARPANCHAYAT
EXPRESSION OF INTEREST

Roc.No.136/2025/F1, **Dated.28-11-2025**

The Akiveedu Nagarpanchayat has decided to hire an agency, Where the agency collects the chicken waste form all chicken shops in Akiveedu Nagarpanchayat, transport it to their safe disposal facility. In this regard, the Akiveedu Nagar panchayat invites private sector parties / agencies either individually or in consortium to submit non-binding Expressions of Interest (EOI) with regard to the proposed work.

Interested bidders can obtain EOI document form Public Health Department, Akiveedu Nagar panchayat office and submit their proposals in office tender box tender bids form 01-12-2025 at 11.30 AM onwards.

1.Last date / time of submission of tenders : 09-12-2025 at 2.00 PM.
2.Date / time of opening of tenders : 09-12-2025 3.00 PM.
3.For Further details contact : Commissioner, Akiveedu Nagar panchayat, West Godavari District, A.P.
E.mail: akiveedunagarapanchayat@gmail.com, Phone: 9441554604

Sd/- Commissioner, Akiveedu Nagarpanchayat

పలువురికి సత్కారం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పోణంగి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తూ ఉద్యోగోన్నతిపై గొల్లగూడెం జిల్లా పరిషత్ పాఠశాలకు బదిలీ అయిన యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ ముస్తఫా ఆలీని, వైఎస్ఆర్ నగర్ పాఠశాలలో పనిచేస్తూ పంగిడిగూడెం పిఎస్ హెచ్‌ఎంగా బదిలీ అయిన కపిలవాయి పద్మావతిని శుక్రవారం పోణంగి పాఠశాలలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంబాబు అధ్యక్షత వహించగా ఎపి ఎస్‌టిఎ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జిజెఎ స్టీవెన్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైందన్నారు. ఉపాధ్యాయులు శ్యామల, ముకుంద లక్ష్మి, శాంతిశ్రీ, సుబ్బలక్ష్మి సురేఖ, వైఎస్ఆర్ నగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చిట్టి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అమరశ్రీకి సేవా పురస్కారం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లా లయన్స్ నాయకుడు, సామాజిక సేవకుడు, లయనిజంలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో పలు సత్కారాలు అందుకున్న సేవా తత్పరుడు అమర శ్రీ తన వైద్య సేవలకు మరో ఉత్తమ అవార్డును అందుకున్నారు. తన గవర్నర్ పదవీ కాలంలో జిల్లావ్యాప్తంగా ఉన్నతమైన వైద్య సేవలందించినందుకు గట్టిం మాణిక్యాలరావు, సరోజినీ దంపతులు ఏలూరులో నిర్వహించిన కార్యక్రమంలో సేవామణి వైద్య సేవా అవార్డును అమర శ్రీకి ప్రదానం చేశారు. అమర శ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరాలు, ఉచిత కంటి శస్త్ర చికిత్స శిబిరాలు వంటి సేవా కార్యక్రమాలు విశేష ప్రశంసలు అందుకున్నాయి. ఈ సందర్భంగా గట్టిం మాణిక్యా లరావు, సరోజినీ దంపతులు అమర శ్రీ, ఇందిరా దేవి దంపతులను శాలువాతో సన్మానించి అవార్డును అందించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరం

జీలుగుమిల్లి :సైబర్ నేరగాళ్ల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వి.క్రాంతికుమార్ అన్నారు.శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల నిరోధం,పోక్సో చట్టాలు, సైబర్ నేరాల వల్ల కలిగే అనార్థల పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సంధర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ ఇటీవల కాలంలో సోషల్ మీడియా ప్రభావం యువత మీద తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు.యువత మాదక ద్రవ్యాల జోలికి పోకుండా ఉండాలని,విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించకూడదని సూచించారు.

CHANGE OF NAME

I, SHAIK M N SULTHANABEGUM D/o SHAIK AKBAR BASHA R/o Door No 14-5-9, Pension line, Near A R D G K School, Eluru, Andhra Pradesh, 534005 have changed my name to **MOHAMMED NABIUNNISA**. Hence forth I am being called as **MOHAMMED NABIUNNISA** for all purposes.

IN THE HONOURABLE COURT OF THE VI ADDITIONAL SENIOR CIVIL JUDGE, AT VISAKHAPATNAM
O.S. 161 /2024

Between:
Sri Sithiri Simhachalam ...Plaintiff
And:
Sri D.S.C. Kumar Raja ...Defendant
To:
Defendant:
Sri D.S.C. Kumar Raja,
S/o Late Gopalakrishna,
Resident of House No.3-157,
Bapulapadu Post Office and
Mandal, Hanuman Junction,
Eluru District -521105

NOTICE

Please take summons that the above named Plaintiff has instituted the above suit against the defendant for recovery of amount due under the promissory note and for other reliefs, and the same stands posted to **29.12.2025** for your appearance on that day at **10-30 AM.** You should appear before the aforesaid Honourable Court either in person or through an Advocate without fail, else the matter will be determined in your absence, exparte.

(N. SESHU KUMAR)
Advocate
Flat No.203 &204
R.K. Towers,
Krishna Gardens,
Visakhapatnam

IN THE HONOURABLE COURT OF THE VI ADDITIONAL SENIOR CIVIL JUDGE, AT VISAKHAPATNAM
I.A.212 /2024 IN O.S. 161 /2024

Between:
Sri Sithiri Simhachalam ... Petitioner/Plaintiff
And:
Sri D.S.C. Kumar Raja ...Respondent/Defendant
To
Respondent :
Sri D.S.C. Kumar Raja,
S/o Late Gopalakrishna,
Resident of House No.3-157,
Bapulapadu Post Office and
Mandal, Hanuman Junction,
Eluru District -521105.

NOTICE

Please take notice that the above named petitioner has instituted the above suit against the respondents for recovery of amount due under the promissory note and for other reliefs, in which the IA.212/2024 is coming up for issuance of notice and the same stands posted to **29.12.2025** for your appearance on that day at **10-30 AM.** You should appear before the aforesaid Honourable Court either in person or through an Advocate without fail, else the matter will be determined in your absence, exparte.

(N. SESHU KUMAR)
Advocate
Flat No.203 &204
R.K. Towers,
Krishna Gardens,
Visakhapatnam

CHANGE OF NAME

I, **NAKKA AMMAJI** W/o. Nakka Venkateswara Rao alias Nakka Venkatesh, D.No.7-116, Vedangi Palem Post, Poduru Mandal, W.G.Dt. A.P. I have changed my name from **NAKKA ESTHER RANI** (Old name) to **NAKKA AMMAJI** (New name) hence forth I am being called **NAKKA AMMAJI** W/o. Nakka Venkateswara Rao alias Nakka Venkatesh for all purposes.